పెట్టిందని తేట తెల్లమయింది. తెల్లారి లేస్తూనే గంతుల మేష్టారు "నీ మొహం మండా అప్పుడే తెల్లారిందే" అంటూ లేచేవాడు. ఓసి నీ అమ్మ కడుపు మాడా, "నీ మొహం ఈడ్చా" – "నీ తల్లి బొడ్డు పొక్క" – అంటూ యాకరువు పెట్టేవారు. ఇప్పుడు ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం అధికమయినందున మన అధునాతనిక్స్ రాస్కెల్, ఇడియట్, యాస్, లిటిల్ స్కవుండ్రల్ అని తిడుతూ వచ్చారు, కాని వైదీకపు తిట్ల ముందర ఇంగ్లీషు తిట్లు వేదమంత్ర ఘోష జరుగుతుండగా ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్ చదివినట్లుంటుంది.

గంతుల మేష్టారి విషయం ఎందు కొచ్చిందంటే గంతుల మేష్టారి సతీమణిలాగా మన లేడీస్ మగాళ్ళని అట్టే కేర్ చేయకుండా వాళ్ళ ఇన్ అండ్ అవుట్స్ కనిపెట్టి నొక్కవలసిన చోట గట్టిగా నొక్కాలి.

అసలు ఆడాళ్ళు హిజ్ మాస్టర్స్ వాయిస్ ప్లేట్ మీదుండే కుక్కల్లాగా వుండకూడదని చెప్దామని సోది మొదలెట్టాను. మధ్యలో గంతుల మేష్టారొచ్చి మన టాపిక్ చెడగొట్టారు. చెడగొడితే చెడగొట్టారు. కాని గంతుల మేష్టారి పెళ్ళావు లేడీస్‌లోకెల్ల చెప్పుకోతగ్గలేడి. అస్సలావిడే గొప్ప డాంకేరు మాష్టారు. అల్లక్కడ శ్రీకృష్ణుడొచ్చాడు. రథం దిగి అర్జునుడికి గీతోపదేశం చేస్తున్నాట్ట. మనం కూడా విందామా వెళ్ళి పిన్ని గారూ వస్తారా అంటే ఐ డోంట్ కేర్ అంటుంది. సచ్చే లేడితో స్నేహం నిజంగా వండరాఫ్ వండర్స్.... గంతుల మేష్టారి పెళ్ళాం పేరు చెప్పమంటారా...నో...నో...చెప్పను. ఆవిడ ఫ్రండ్‌షిప్ అనగా స్నేహితపువోడను ఐ వాల్యు మోస్ట్ నేను అన్నిటికన్నా మిన్నగా భావిస్తాను.

# మేలుకొలుపులు

మావారిని నిద్రలేపటం చాలా కష్టం. లెట్‌ది స్లీపింగ్ డాగ్స్ లై అని ఇంగ్లీషు వాడన్నాడు. సుప్తభుజంగంలా మౌనమృదంగంలా మావారలా పడుకునుంటేనే ప్రాణానికి రవ్వంత హాయీ సుఖమూను. నిద్రపోతుంటే అంతా దేవుళ్ళలాగే వుంటారు, లేస్తేనే దయ్యాలూ భూతాలూ ఎట్‌సెట్రాల్లా కనిపిస్తారు మనుషులు. పతిదేవుళ్ళకు మంచాల దగ్గర భూపాలరాగాలు పాడితే లాభంలేదు. ట్రాన్సిస్టర్లు మ్రోగిస్తే మెలకువొస్తుంది. ఎవరో సిస్టర్ పాడుతోందికదా అని పాపం ఆశపడి లేస్తారు. నిద్రమంచంమీంచి లేవటమనే సన్నివేశానికి మన కల్చర్‌లో రిలిజన్‌లో ట్రెడిషన్‌లో చాలా యింపార్టెన్సు వుంది. నిద్ర, చీకటి, అజ్ఞానం ఈ మూడు మూడే. వీటిలోంచి ఎవరైనాసరే మేలుకొని పాటలు పాడితే ఆనందంగానే వుంటుంది మరి.

తెలతెల వారుతూంటే యిక పాలవాడికేక వినిపించే ముందు అప్పుడెంత బద్ధకంగా ఉంటుందో లేవటానికి నాట్ సో యీజీ టు రైజ్, అప్పుడు పక్కలోంచి లేచి పనిపాట్లు చేసుకునే

ప్రతి ఆడది మహా పతివ్రతేనంటాను నేను. మొగుడ్ని వదిలి గదిలోంచి తెలుగు న్యూసవుతున్నా పైకిరాని ఆడది పతివ్రత ఎలాగవుతుంది? మొగుడ్ని జిగురేసి అంటించినట్లు అతుక్కుని తిరిగే లేడీ పతివ్రత కాజాలదు. పతివ్రత అంటే ది రివర్స్ యీజ్ ట్రూ - అష్టకష్టాలు పడుతూ తన్నులు తింటూ, త్యాగాలు చేస్తూ మాసిపోయిన చీర కట్టుకుని తులసికోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ క్లాసికల్ మ్యూజిక్ పాడాలి. పతివ్రతల మొగుళ్ళు చాలా రాస్కెల్స్, వాళ్ళతో సాటి మొగాళ్ళే కాపురం చేయలేరు. ఇక స్కెల్టెన్ లాంటి ఆడదెలా చేస్తుంది?

మార్నింగ్ అంటూ చాలా ప్రెషస్ టైము ప్రెషస్ టైము అని మావారు చిందులు తొక్కుతూంటారు. మొగాళ్ళు వాళ్ళ టైమ్ ప్రెషస్ టైము అనుకుంటారు. లైఫ్ ప్రెషస్ గదా అందులో కొంత భాగం విడదీసి యిది అమూల్యమైనది యిదికాదు అనటం బాగులేదు గురూగారూ అంటాన్నేను. మార్నింగ్ టైములో షేవ్ చేసుకోవాలి, అది చేసుకొవాలి, ఇది చేసుకోవాలి అని గంతులెయ్యకపోతే అమూల్యమైన కాలాన్ని అమూల్యంగానే ఖర్చుపెట్టుకోరాదూ, ఎవరొద్దన్నారు?

ప్రత్యూషవేళ మేలుకొలుపు పాటలు నిజంగా చాలా కమ్మగా బాగుంటాయి. అవి ఎవరైనా చక్కగా పాడుతుంటే, అలా వింటూ ముసుగెట్టి దొంగనిద్ర పోవాలనిపిస్తుంది. మన దేవుళ్ళంతా పతిదేవుళ్లతో సహా అల్మోస్ట్ నిద్రమాత్రలు మింగిన బాపతు. భూపాల రాగంలో మేలుకొలుపులు పాడితేనే కాని లేవరు.

మన గాడ్స్‌కి ప్రభాత సేవలన్నా పవళింపు సేవలన్నా చాలా యిష్టం. యీగోటు ఎనీటెంపుల్- దేవుడ్ని నిద్రలేపటం చాలా కష్టం. భక్తులు, పూజార్లూ సన్నాయి మేళలవాళ్ళూ కలిసి కలియబడి గొడవచేస్తేనేకాని దేవుడు నిద్రలేవడు. నిద్రపోయే దేవుళ్ళంటే మనకు చాలా యిష్టం. మనం నిద్రలేపితే లేస్తాడు. మనం పడుకోవయ్యా అంటే పడుకుంటాడు. మన చేతుల్లో స్టూజిలా వుండే దేవుళ్ళే మనకు కావాలి. మరోరకంగా చెప్పాలంటే వెంకటేశ్వరస్వామి, భద్రాద్రిరాముడు, సింహాద్రిఅప్పన్న, అన్నవరం సత్తిన్నారాయణస్వామి వీళ్ళంతా మనకు చాలా మోస్ట్ ఒబిడియంట్ సర్వెంట్లు, వీళ్ళని సుప్రభాతాలుపాడి నిద్ర లేపకుండా కొన్నాళ్ళు అలాగే పడుకోనిస్తే ఎలా వుంటుంది? వెంకటేశ్వర సుప్రభాతం చూడండి. అందులో ఓ మ్యూజిక్ లేదు. ఓ పొయిట్రీలేదు. ప్రతి శనివారం చెవిగోసిన మేకల్లాగ అరవటంతప్ప - "కౌసల్యాసుప్రజారామా" ఏవిటి నరశార్దూల మేవిటి? పడుకునివున్న పులికంటె మేలుకొని వున్న పిల్లి మేలుకదా! శ్రీరాముడు ఐతిహాసిక పురుషుడు. వెంకటేశ్వర్లు శ్రీరాముడు కాదు కాలేదు కాజాలడు.

కలికాలంలో భక్తిని సింపతిపై చేసి దేవుడ్ని మోక్షం అడగటానికి జపతపాలు నియమమూ నిష్టా ఏవీ అక్కర్లేదు. నామసంకీర్తనం చేస్తేచాలు. కొందరు భక్తులు ఈ నామస్మరణకు కూడా షార్ట్‌కట్ కనుగొన్నారు. ఒకు రేకుచక్రం మీద రామరామ అని వ్రాసి దాన్ని వాటర్‌ఫాల్స్‌లో ఫిక్స్ చేయించాడ్ట ఒక భక్తాగ్రేసరుడు. ఆ చక్రం తిరుగుతూ వుంటుందికదా. అది

తిరిగినంతకాలం రామరామ జపఫలమంతా పళ్ళెం తాలుకు ఆసామీకి ఇహం నుంచి పరానికి బట్వాడా అయి అక్కడ క్రెడిటవుతుందట. దేవుడికి చిట్టిగారెలంటేను దధ్యోదనం చక్రపొంగలి భజనలంటేను చాలా యిష్టం. (ఎవరికిష్టం వుండదు?) మనవాళ్ళ థీరీప్రకారం దేవుడు ఎంత డబ్బాకొడితే అంత సంతోషిస్తాడు. భక్తవశంకరుడన్నారుకదా? ఓటి గుర్తుంచుకోవాలి. దేవుడు ప్రోజాక్టర్ కాదు. దేవుడికి ప్రోజంటే ఇష్టం వుండదు. దేవుడికి శాన్‌స్క్రిట్ అంటే చాలా లైకింగ్. కొందరికి పాటలు పద్యాల నాటకాలే యిష్టమైనట్లు, దేవుడికి పాటలు పద్యాలు రెండూ యిష్టం. దేవుడితో సింపుల్ తెలుగులోమాట్లాడితే పనులు జరగవు. దేవుడ్ని కొంచెం భక్తితో పొగడాలి.

జనం ఎక్కువైతే భక్తి పలచబడుతుంది. కాబట్టి భజనలు నామసంకీర్తనలు ఏకాహాలు వగైరా వగైరా ఏర్పాటుచేశారు. ఇహ బంధాలు భవబంధాలు అంటూ తోటలు దొడ్లూ వడ్డీ వ్యాపారాలుచేసి అందులో వాటా దేవుడికి పెట్టి ప్రపంచాన్ని లోకాన్ని పుట్టిన పిల్లలనూ అసహ్యించుకోడం భక్తిమార్గంలో ఒక మెట్టు. సంసారం రోత సాగరం గుడ్డూ గూసూ అని చెప్పటం రెండుమూడు పెళ్ళిళ్లు చేసుకుని, ఒకటి రెండు కాపురాలు చెడగొట్టి బయట కక్కుర్తిపడి యిల్లు - వొళ్ళు - గుల్ల చేసుకుని ఏ బాబాగారి దగ్గరికో వెళ్ళి తరుణోపాయం సెలవిస్తారా? సంసారవంటే, ఈ లోకవంటే రోతపుడుతోంది అని దకల్లానోరుతెర్చుకుని అడగటం మనుష్యులకు మామూలై పోయింది. చాలా మంది మోక్షగాములు పూర్వాశ్రమంలో జల్సారాయుళ్లు. శ్రీకాంతామణి కుచకుంభయుగ్మములపై దృష్టి తప్పించకుండా బ్రతికినవాళ్ళు. వైస్‌లో బ్రతికి అది నైస్‌గా లేదనుకోవటం మనకు మామూలే - దానిమీద భక్తి ముసుగు కప్పగానే పరమాత్ముడిలీల అయిపోతుంది అంతా - లోక్లాసువాళ్ళు చదువులూ, సంస్కారాలూ లేని వాళ్ళు యిన్ని ముసుగులు కప్పలేరు కదా - వాళ్ళకు దేవుళ్ళూ గుళ్ళూ అన్నీ బందే - వాళ్ళ కిన్ని యోగాలు యోగమాయలు తెలవ్వుకదా. వారికి చెక్కభజనలు దాసరితత్వాలు దాసుగారి కీర్తనలు వుండనే వున్నాయి. భక్తిరసం కులాల వారీగా ప్రవహించి ప్రవహించి పందిళ్ళల్లో భజనరూపంలో - టెంకాయలు దక్షిణలు కర్పూర హారతులదాకా వచ్చి అక్కడ నిల్చిపోయింది.

"అక్కడ వుండే పాండు రంగడు ఇక్కడ వున్నాడు" అంటూ పాండురంగ భజనలు, దరిమిలాను "జై హరనాథ జై కుసుమా కుమారి జై" అంటూ కుప్పిగంతులూ వచ్చాక మధ్యలో "సాయిబాబా" శకం వచ్చి కలిసింది. అందులో డూప్లికేటు, సాయిబాబా శకంవలె సత్యశాయిబాబా శకం ఒకవైపునుంచీ మెహర్‌బాబా శకం ఒకవైపునుంచీ వచ్చి జనాన్ని వుక్కిరి బిక్కిరి చేసి పారేశాయి. ఈ గడ బిడల్లో మన వెంకటేశ్వర స్వామివారు చెక్కు చెదరకుండా తమ వడ్డీ డబ్బులు బిజినెస్ జాగ్రత్తగా కాపాడుకొంటున్నారు, సరే కనకదుర్గ దేవీనవరాత్రులూ, గణపతి నవరాత్రులు భద్రాద్రి రామునికి రామనవమి ఉత్సవాలు ఏటా యథావిధిని జరిగి పోతున్నాయి. తెలుగుదేశంలో భక్తిరసానికి నవంబరు ఒకటి తరవాత కూడా అట్టే డేంజరు ఏమీలేదు. స్వాములూ స్వాములార్లూ సుఖంగానే వున్నారు, దేవుళ్ళు వారి భక్తులూ కులాసాగానే

వున్నారు. యెటొచ్చీ సామాన్య ప్రజలకే బ్రతుకు మరీ చికాకై పోతోంది. వచ్చేది చాలకుండా వుంది. పిల్లల చదువులు రోగాలు మందులా ఖరీదైపోయాయి.

"శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందం, హరె రాం హరె కృష్ణ రాధే గోపాలం, అని చిరతలు వాయిస్తూ తబలా మ్రోగిస్తూ ప్రసాదాలు ఆరగిస్తూ ధూప, దీప నైవేద్యాలతో కాలక్షేపం చేయటానికి యిది టైమ్ కాదు. లేచీ లేవటం నేను వంటింట్లోకి, మా వారు పొట్ట చేత్తో పట్టుకుని ఆఫీసుకి పరుగో పరుగు, ఏంచేస్తాం, ఆ భగవల్లీల అలాగుంది? అంతే మన చేతిలో ఏం వుంది? ఆ జీతం డబ్బులు చేతిలో పడకపోతే మన బ్రతుకులు వీధిలోకి పరుగో పరుగు. ఇంతకీ నా పాయింటేవిటంటే ఆ నిద్రపోతున్న దేవుళ్ళని లేపి మేల్కొలుపులు పాడి మన పీకల మీదకి తెచ్చుకుంటున్నాం. ఒక విషయం గుర్తుంచుకోవాలి బోయిస్ అండ్ గ(ర)ల్స్ దేవుడు మనం నిద్రలేపితే కాని లేవడు. నిద్రపోయే దేవుళ్ళను నిద్రపోనివ్వడం మంచిది. కాని నిద్రపోయే మనిషిని మాత్రం లేపటం ధర్మం. అతను కసురుకున్నా నిద్రలేచి కళ్ళు తెరుస్తాడు కదా? ఎవరైనా కళ్ళు తెరవటం మంచిదంటారా? కాదంటారా? దేవుడు ఎప్పుడూ కళ్ళు తెరవడు. అతని కళ్లు తెరిపించే ప్రయత్నాలు చేయడంకంటె, మనిషి కళ్ళు తెరిపించటం ఈజీ.

లేవండోయ్ శ్రీవారూ! లేస్తారా, చెవిలో నీళ్ళు పోయమంటారా? మీరు లేవకపోతే పాడి పంటల కార్యక్రమం బిగ్గరగాపెట్టి వెళ్ళిపోతే రేడియో కట్టెయ్యడానికని మీ అంతట మీరే లేస్తారు? కాని పొద్దున్నే రేడియో ట్యూన్ చేస్తే నేను మళ్లీ స్నానం చెయ్యాలి. ఆ చేత్తో కాఫీయిస్తే మీరు విసిరికొట్టేస్తారు కదా? ఓ నరబల్లీ, నరచిలకా, నరశార్దూలమా లెమ్ము గృహరాక్షసి. చీపురు కట్లను తెచ్చి మెట్లను చిమ్ముతున్నది. కాఫీ మరిగి మాడు వాసన వేయుచున్నది. ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద, ఉత్తిష్ఠ గరుడధ్వజ, ఉత్తిష్ఠ కమలాకాన్తత్రైలోక్యం మంగళంకురు.

# వన్సపానెటైమ్....

**వ**న్సపానె టైమ్ (అనగనగా) ఒకప్పుడు మా "హి" గారు ఇహ్హిహి అంటూ "నీకు గ్రామఫోన్‌కీ టెలిఫోన్‌కీ తేడా తెల్సా." అని నన్ను చెట్టంతదాన్ని (నేనుచెట్టంత వుండననుకోండి. మరి తెలుగులో అలా తగలడింది మెసేజి) పట్టుకుని వేళాకోళమాడారు. ఆల్‌రైట్ పదండి సాయంత్రం తోట్లోకి అక్కడ మీ డిసీజ్ కుదురుస్తాను అని చిన్న శపథంలాటిది చేశాను. ఎక్కడైనా బావగాని వంగతోట్లో బావ కాదన్నారు కదా అని ముందు వంగతోట్లోకి తీసికెళ్లాను. "అరె యిక్కడ వంకాయ చెట్లు వేశారే" అని మావారు ఆశ్చర్యపోయారు. ఇది వంగ తోటకాదు టమాటో తోట అన్నాను. "హ్హో ఐసీ" అన్నారు కళ్ళజోడు సర్దుకుంటూ, మరి టమాటో తోట అన్నావు కదా టమాటో చెట్లకి వంకాయలు కాస్తయా అని అడిగారు. టమోటో చెట్లకి వంకాయలు